పారిశ్రామిక నగరం.. అభివృద్ధికి దూరం!



వర్షానికి చెరువుగా మారిన గొయ్యి (ఫైల్)



గాజువాక పట్టణం



రోడ్డుపై సాధన చేస్తున్న విద్యార్థులు

పారిశ్రామిక నగరంగా గుర్తింపు పొందిన గాజువాక ప్రాంతంలో అభివృద్ధి కానరావడం లేదు. రోడ్లు, కాలువలు తప్పితే ప్రధాన సమస్యల పరిష్కారంపై పాలకులు దృష్టిసారించడం లేదు. విశాఖలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో సౌకర్యాలు రెండు దశాబ్దాల కిందట కల్పించినవే. మహాపట్టణానికి కీలకమైన గాజువాకలో ఒక ఇల్లు కట్టాలంటే మున్సిపల్ అనుమతులకు సిఫార్సులు చేసుకోవాల్సి వస్తోంది. సేదదీరేందుకు సరైన పార్కులేని పరిస్థితి నెలకొంది. ఔత్సాహిక క్రీడాకారులు రోడ్లపై సాధన చేయాల్సిన దుస్థితి ఉంది. పేద విద్యార్థులు చదువుకోవడానికి ప్రభుత్వ కళాశాలకు నోచుకోని దౌర్భాగ్యం వెంటాడుతోంది.

– గాజువాక

ప్రధాన సమస్యల పరిష్కారంపై కానరాని శ్రద్ధ

మైదానాలు లేక క్రీడాకారుల అవస్థలు

ఆహ్లాదం అంతంతమాత్రమే..

దశాబ్దాలుగా నలుగుతున్న గాజువాక హౌస్ కమిటీ పరిధిలో 900 ఎకరాల భూములపై క్రమబద్ధీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. దీనికోసం ఉద్దేశించిన జీవోల్లో షరతులు గుదిబండగా మారడంతో అత్యధికమంది ప్రయోజనం పొందలేకపోతున్నారు. వివిధ జీవోలతో కొన్ని నివాసాలను క్రమబద్ధీకరించినప్పటికీ కటాఫ్‌డేట్లు, ఇనాందారీ సమస్యలు, నో మ్యాన్ ల్యాండ్, పోరంబోకు భూములు, గెడ్డలు, చెరువులు పేరిట సమస్యను సాగదీస్తున్నారు. ఈ సమస్యల వల్ల సుమారు ఎనిమిది వేల మంది అనర్హులుగా మిగిలిపోయినట్టు తెలుస్తోంది.

ప్రైవేట్ కళాశాలలే దిక్కు

ఐదు లక్షల మంది జనాభా ఉన్న గాజువాక నియోజకవర్గంలో ఒక్క ప్రభుత్వ కళాశాల కూడా లేదు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, ముఖ్యంగా పేద, మధ్యతరగతివర్గాలకు చెందినవారు ఇక్కడికి వలస వస్తున్నారు. వారి పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించాలంటే ప్రైవేట్ కళాశాలలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇక్కడ డిగ్రీ చదువుకోవాలంటే ప్రైవేట్ కళాశాలలు మాత్రమే ఉన్నాయి. దీంతో ఆర్థికంగా వెనుకబడిన వారు ఉన్నత విద్యకు దూరమవుతున్నారు. గాజువాకలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలతోపాటు ఒక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కూడా ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి.

ఆక్రమణలో ఫుట్‌పాత్‌లు

కొత్తగాజువాక నుంచి పాతగాజువాక వరకు ఉన్న మెయిన్ రోడ్డు ఫుట్‌పాత్‌లు వ్యాపారాలకు ఉపయోగపడుతున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఫుట్‌పాత్‌లను రెడీమేడ్ వ్యాపారులు, చెప్పుల దుకాణాలు, పండ్ల వ్యాపారాలకు వేదికవుతున్నాయి. ఫుట్‌పాత్‌లతోపాటు వివిధ రోడ్లలో రోడ్ మార్జిన్‌లు కూడా ఫుట్‌పాత్ వ్యాపారాలకు నిలయాలుగా మారుతున్నాయి. వంటిల్లు జంక్షన్ నుంచి గోపాలరెడ్డినగర్ వరకు, జగ్గు జంక్షన్ నుంచి గాజువాక మార్కెట్ వరకు, పాతగాజువాక నుంచి వంటిల్లు జంక్షన్ వరకు గల రోడ్ మార్జిన్‌లో లెక్కలేనన్ని ఫుట్‌పాత్ వ్యాపాలు కొత్తగా పుట్టుకొచ్చాయి.

ఆట స్థలాలు లేక అవస్థలు

దినదినాభివృద్ధి చెందుతున్న గాజువాకలో సరైన క్రీడా ప్రాంగణం లేదు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులున్న ఈ ప్రాంతానికి ఈ లోటు తీరని వేదన మిగుల్చుతోంది. దీంతో ఔత్సాహిక క్రీడాకారులు నడిరోడ్లపైనే సాధన చేసుకుంటున్నారు. ఆదర్శ గ్రౌండ్‌లో చేపట్టిన ఇండోర్ స్టేడియం నిర్మాణం నత్తకు నడకలు నేర్పుతోందన్న విమర్శలున్నాయి.

చెరువును తలపించేలా రోడ్లు

రోడ్డు మధ్యలో ఏర్పడిన గోతులు వర్షాలు పడితే చెరువును తలపిస్తున్నాయి. ఆ గోతులోనుంచే రోజు వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతుంటారు. పోర్టు వై జంక్షన్ నుంచి ఉక్కునగరం వెళ్లే ప్రధాన రహదారిలో దుర్గానగర్‌వద్ద రోడ్డుపై ఈ పరిస్థితి నెలకొంది. దుర్గానగర్, దిబ్బపాలెం, రామ్‌నగర్, మరో వైపు సర్దార్ నెస్ట్ గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్‌మెంట్స్‌తోపాటు అటు ఉక్కునగరం, స్టీల్‌ప్లాంట్, పరవాడ, అచ్యుతాపురం వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. దీంతోపాటు స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే భారీ వాహనాలు కూడా ఇదే దారిని ఉపయోగిస్తాయి. భారీ వాహనాల కారణంగా రోడ్డు మధ్యలో ఏడాది కిందట గొయ్యి ఏర్పడి ఇప్పుడు చెరువుగా మారిపోయింది.

మధ్యవర్తులతో కేసుల సత్వర పరిష్కారం



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తులు

గాజువాక: న్యాయస్థానాల్లో కేసులను మధ్యవర్తుల సహకారంతో సత్వరమే పరిష్కరించుకోవాలని గాజువాక న్యాయ సేవా సంస్థ చైర్మన్ జి.షణ్ముఖరావు అన్నారు. గాజువాక కోర్టు ప్రాంగణంలో రెండో రోజు ఏర్పాటు చేసిన మధ్యవర్తిత్వంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కోర్టుల్లో దాఖలయ్యే సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి సుదీర్ఘ కాలంగా పోరాడే ఇబ్బందులు లేకుండా ఇరువర్గాల మధ్య మధ్యవర్తిత్వం వహించి సామరస్య వాతావరణం నెలకొల్పితే కేసులు త్వరితగతిన పరిష్కారమవుతాయన్నారు. కాగా, దీనికి సంబంధించి శిక్షణ పొందిన మధ్యవర్తి ఆధ్వర్యంలో కోర్టుకు వచ్చిన కక్షిదారులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎస్.కవిత, వెంకటశేషమ్మ, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు యశోధర వేదమణి పాల్గొన్నారు.

రైలు నుంచి జారి గుర్తు తెలియని వ్యక్తి మృతి

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి జారిపడి దుర్మరణం చెందాడు.దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ కె.టి.ఆర్.లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. దువ్వాడ – కాపు జగ్గరాజుపేట మధ్యలో విశాఖపట్నం నుంచి విజయవాడ వైపు వెళ్లే రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్టు కీమెన్ దువ్వాడ జీఆర్‌పీకి సమాచారం అందించారు. జీఆర్‌పీ ఎస్‌ఐ లక్ష్మి తన సిబ్బంది అక్కడి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతుని వయసు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, మృతదేహంపై పింక్ రంగులో షర్ట్, జీన్ ఫ్యాంట్ ఉన్నట్టు ఆమె తెలిపారు. వివరాల కోసం 73820 58996 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

క్లుప్తంగా

పరిశుభ్రతతో ఆరోగ్యం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పెద్దలు

కూర్మన్నపాలెం: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. డ్రైడే,ఫ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం కణితి హైస్కూల్లో నిర్వహించారు. విద్యార్థులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు.అలాగే నివాసమున్న చోట మురుగు నిల్వలు ఉండా కుండా చూసుకోవాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడడం .. వాటిని ఎక్కడి పడితే అక్క పడేయడం వల్ల పశువులు తిని మరణిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరుమలనగర్ సంక్షేమసంఘం పెద్దలు పరమానందం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింగరావు, శానిటరీ సిబ్బంది అప్పారావు, నీలిమా, నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స.హ.చట్టంతో కదిలిన అధికారులు

అగనంపూడి: విధి నిర్వహణలో మరణించినా ఐవోడీ ధ్రువీకరిస్తే తప్పా బీమా సొమ్ము చెల్లించేది లేదని తిరస్కరించిన బీమా అధికారులు మృతుడి కుటుంబానికి నేడు సొమ్ము చెల్లించేందుకు ముందుకు వచ్చారు. 2016లో అగనంపూడి పినమడకు చెందిన ఉక్కు కార్మికుడు సీతిన అచ్చుతరావు విధి నిర్వహణలో మృతి చెందాడు. అయితే అప్పట్లో విభాగం హెచ్‌ఓడీ ధృవీకరించలేదనే నెపంతో సాధారణ బీమా సొమ్ము చెల్లించి చేతులు దులుపేసుకున్నారు. ప్రమాదవశాత్తు మృతిచెందిన పక్షంలో పాలసీ మొత్తం చెల్లించాల్సి ఉండగా నిరాకరించారు. దీంతో వినియోగదారుల హక్కుల పరిరక్షణ కమిటీ కన్వీనర్ పట్టా రామ అప్పారావు జెసీఎల్‌కు ఫిర్యాదు చేయడం, స.హ.చ ద్వారా వివరాలు సేకరించి బాధితుల పక్షాన నిలబడడంతో ఎట్టకేలకు బీమా సంస్థ ప్రమాద మరణంగా భావించి మొత్తం చెల్లించడానికి అంగీకరిస్తూ తనకులేఖ ద్వారా తెలియజేశారని బాధితుని భార్య లక్ష్మి శుక్రవారం తెలిపారు.

మరిడిమాంబకు మకర తోరణం బహూకరణ



గ్రామదేవత మరిడిమాంబ అమ్మవారికి మకరతోరణం తొడుగుతున్న దాతలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ కొండయ్యవలస గ్రామ దేవత మరిడిమాంబకు దాట్ల సుబ్రహ్మణ్య రాజు దంపతులు మకర తోరణం బహూకరించారు. ఆలయంలోని అమ్మవారికి దాతలు సుబ్రహ్మణ్యరాజు దంపతులు చేతుల మీదుగా అమ్మవారికి అలంకరింపజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ బలిరెడ్డి శ్రీను మాట్లాడుతూ అమ్మవారికి మకర తోరణం అందించిన దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బుదిరెడ్డి కన్నారావు, సాలాపు నరసింగరావు, సాయిన సన్యాసిరావు, విందుల వరహాలు, పంతులు రవి పాల్గొన్నారు.

శాకంబరిగా దుర్గమ్మ



శాకంబరి అలంకరణలో దుర్గాదేవి

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని దుర్గాలమ్మను శుక్రవారం శాకంబరీదేవి రూపంలో అలంకరించారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవార్ని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వందలాది మంది భక్తులు అమ్మవార్ని దర్శించుకొని పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. చీర సారెలు,ముడుపులు చెల్లించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అగనంపూడికి చెందిన బొర్రమాంబ పారాయణసేవా సమితి ఆధ్వర్యంలో లలిత సహస్ర పారాయణం చేశారు. ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

కూటమి మోసాలను ఇంటింటికీ వివరిద్దాం

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త దేవన్‌రెడ్డి



71వ వార్డు కార్యక్రమంలో పాల్గొన్న దేవన్‌రెడ్డి



69వ వార్డులో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు



87వ వార్డులో మాట్లాడుతున్న దేవన్‌రెడ్డి

గాజువాక: కూటమి ప్రభుత్వ మోసాలను ఇంటింటికీ వివరించాలని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి కోరారు. 69వ వార్డులో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను చంద్రబాబు మోసగించారన్నారు. అధికారం చేపట్టి ఏడాది గడిచినా హామీలును అమలు చేయలేదన్నారు.ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు గుర్తు చేయాలని కోరారు. 69వ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు (సన్నీ) ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో వార్డు నాయకులు పాల్గొన్నారు.

71వ వార్డులో..

బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని 71వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలను మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించాలన్నారు. ఇంటింటికీ ప్రచారం చేస్తున్న క్రమంలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చంద్రబాబు ఎన్నికల హామీలను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. వార్డు అధ్యక్షుడు భూపతిరాజు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, వార్డు నాయకులు పాల్గొన్నారు.

- సూపర్ సిక్స్ అంటూ అనేక హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబు ప్రజలను అన్ని విధాలుగా మోసగించారని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి అన్నారు. 73వ వార్డులో నిర్వహించిన బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కూటమి మోసాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా చెప్పాలని కోరారు. వార్డు అధ్యక్షుడు షౌకత్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, వార్డు నాయకులు పాల్గొన్నారు.

ప్రజల్లోకి వైఫల్యాలు

కూర్మన్నపాలెం: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి పిలుపు నిచ్చారు. 87వ వార్డు కణితి కాలనీలో శుక్రవారం జరిగిన బాబుష్యూరిటీ- మోసం గ్యారెంటీ సభలో ఆయన మట్లాడారు. నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి బాబుమోసాలను ప్రజలకు వివరించడం ద్వారా జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలోపేతం చేయాలన్నారు. సమావేశంలో నాయకులు కోమటి శ్రీనివాస్,ప్రగడవేణు, బొడ్డగోవింద్, ఇల్లపురాము, దామోదర్, వెంకటరమణ, కోమటిరమాదేవి, ప్రగడ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ



ర్యాలీ ప్రారంభించిన వైద్యాధికారి ప్రదీప్ ప్రసాద్‌రాజా

పెదగంట్యాడ: చిన్న కుటుంబం చింతలేని కుటుంబమని దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు దేవాడ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా దేవాడ పరిసర ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ కుటుంబ సభ్యులు ఎక్కువైతే వారిని పోషించుకోవడానికి కుటుంబ పెద్ద తీవ్రంగా కష్టపడాల్సి వస్తందన్నారు. ఆర్థిక కష్టాలు మరో వైపు ఆరోగ్య సమస్యలు వేధిస్తాయన్నారు. బాల్య వివాహాలు జనాభా పెరుగుదలకు కారణం అవుతున్నాయన్నారు. జనాభా పెరుగుదల వల్ల తలెత్తే పరిణామాలు, సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది కె. అన్నపూర్ణ, ఎం. శ్రీనివాసరావు, బంకురు గోపాలం, ఎస్. వెంకటలక్ష్మి, ఎన్. సునీత, ఎం. దేవి తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.75 వేల విరాళం



రామాలయ కమిటీ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి, ధర్మాల శ్రీను

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు సిద్దేశ్వరంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి 64వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ధర్మాల శ్రీనివాసరావు రూ.75 వేలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి కార్యాలయంలో దేవన్‌రెడ్డి చేతుల మీదుగా ఆలయ కమిటీ ప్రతినిధులకు శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా దేవన్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయాలు నిర్మించినా, సేవా కార్యక్రమాలు చేసినా ధర్మాల శ్రీనివాసరావు తనవంతు సహకారం అందించడం అభినందనీమన్నారు. కార్యక్రమంలో సిద్దేశ్వరం రామాలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశోధనల నాణ్యతలో రాజీ వద్దు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

విశాఖ సిటీ: పరిశోధనల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.పి.రాజశేఖర్ సూచించారు. ఏయూ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా శుక్రవారం అకడమిక్ సెనేట్ మందిరంలో ప్రారంభమైన 'శతాబ్ది వాణి' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరిశోధనల్లో నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పరిశోధకులు స్వీయ ప్రేరణతో ముందుకు సాగాలని అన్నారు. పరిశోధన గ్రంథ రచనను సరళంగా, సులభంగా, ఆసక్తిదాయకంగా ఎలా చేయాలో వివరించారు. డీన్ ఔట్రీచ్ ఆచార్య కె.రమాసుధ మాట్లాడుతూ, శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా విభిన్న రంగాల నిపుణులను విశ్వవిద్యాలయానికి ఆహ్వానిస్తున్నామని, దీని ద్వారా విద్యా సంబంధిత వాతావరణం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ నెల 17న రెండో 'శతాబ్ది వాణి' ప్రసంగాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య గిరిజాశంకర్, ఆచార్య పద్మశ్రీ, ఆచార్య సీతామాణిక్యం, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ ఆనందగజపతిరాజు, బ్రాండింగ్ అండ్ మీడియా అసోసియేట్ డీన్ డాక్టర్ సాల్మన్ బెన్నీ సహా పలువురు విభాగాధిపతులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి వీవీవీ సమస్య



పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ గాదె

ఉక్కునగరం: విశాఖ విమల విద్యాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం.. ఉపాధ్యాయులతో చర్చించారు. ఉక్కు యాజమాన్యం పాఠశాల నిర్వహణకోసం దయాసిస్ సంస్థకు రాతపూర్వక హామీ ఇవ్వకపోవడంతో పాఠశాల తెరవలేదు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల వినతిమేరకు ఎమ్మెల్సీ శుక్రవారం ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులతో విస్తృతంగా చర్చించారు. అనంతరం ఉక్కు యాజమాన్యం ప్రతినిధులను కలిసి వారి నుంచి సమాచారం తీసుకున్నారు. ఈ అంశాన్ని స్థానిక ప్రజాప్రతినిధులతో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

లారీ ఢీకొని ఒకరు మృతి

గోపాలపట్నం: షీలానగర్ నుంచి పోర్టుకు వెళ్లే దారిలో మారుతీ జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఎయిర్‌పోర్ట్ పోలీసులు వెల్లడించిన వివరాలివి. పరవాడ మండలం గొర్లెవానిపాలేనికి చెందిన ముచల అశోక్ రెడ్డి (45) ద్విచక్రవాహనంపై విధులు నిర్వహించేందుకు వెళ్తుండగా, మారుతీ జంక్షన్ వద్ద వెనుకనే వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో అశోక్ అదుపుతప్పి లారీ ముందు చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అతను జేడీ కన్‌స్ట్రక్షన్ కంపెనీలో ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. అశోక్‌కు భార్య లలిత, కుమార్తె హస్వినిత, కుమారుడు వహినాథ్ రెడ్డి ఉన్నారు. సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్ట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేపట్టారు.

నిబంధనల ప్రకారం వేతనాలు కోరుతూ బైక్ ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ సభ్యులు

బీచ్‌రోడ్డు: ప్రస్తుత ధరల ప్రకారం ఒక కుటుంబం బతకడానికి కనీసం రూ. 26 వేలు ఖర్చు అవుతుందని, కానీ కేవలం రూ. 13 వేలతో పట్టణాల్లో ఎలా జీవించాలని ప్రభుత్వాన్ని జీవీఎంసీ వాటర్ ఫిల్టరేషన్ ప్లాంట్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా 12వ తేదీ నుండి సమ్మె చేస్తున్న సందర్భంగా శుక్రవారం గాంధీ విగ్రహం వద్ద ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకత్వంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కనీస వేతన చట్టం ప్రకారం ప్రతి ఐదేళ్లకు ఒకసారి అప్పటి ధరల ప్రకారం డీఏతో కూడిన వేతనాలు నిర్ణయించాలన్నారు. జీవో 36 ప్రకారం అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ. 21 వేలు, సెమీ స్కిల్డ్ కార్మికులకు రూ. 24,500 చెల్లించాలన్నారు. కార్మిక వర్గం అంతా సమ్మెను జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ బైక్ ర్యాలీలో ప్లాంట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గండి రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ కనకరాజు, జాయింట్ సెక్రెటరీ మహేష్, కోశాధికారి కె. వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ రాజు, జాయింట్ సెక్రెటరీ గండి రమణ, వైస్ ప్రెసిడెంట్ మహేష్, జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శులు టి. నూకరాజు, ఉరికుటి రాజు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

రోడ్డు ప్రమాదంలో నూతన దంపతులకు గాయాలు



గాయపడిన పల్లవికి సపర్యలు చేస్తున్న భర్త

డుంబ్రిగుడ: అరకు అందాలను తిలకించేందుకు వచ్చిన కొత్త జంట రోడ్డు ప్రమాదానికి గురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. పర్యాటక ప్రాంతాలను తిలకించేందుకు విశాఖపట్నంలోని గాజువాకకు చెందిన పల్లవి,దంపతులు ద్విచక్రవాహనం పై వచ్చారు. చాపరాయి జలవిహారిని తిలకించేందుకు అరకు నుంచి బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యంలో పంతలచింత మలుపులో జాతీయ రాహదారిపై కుక్క అడ్డుగా రావడంతో బైక్ అదుపుతప్పి పడిపోయారు. ఈఘటనలో నూతన దంపతులకు గాయాలయ్యాయి. వారిని ప్రైవేటు వాహనంలో అరకులోయ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన శ్రీ రేలంగి సుధాకర్, తండ్రి : ఆర్. కృష్ణ, డోర్ నెం.9-7-37/4, [illegible] విశాఖపట్నం వారు ఇచ్చిన [illegible] ద్వారా తెలియజేయునది ఏమనగా.

నా క్లయింటు ఒరిజినల్ దస్తావేజు నెంబ.10632/1990 మరియు 368/1991, తేది.12.12.1990 [illegible] విశాఖపట్నం నందు శ్రీ రేలంగి సుధాకర్ గారి పేరున రిజిస్టర్ కాబడిన దస్తావేజులు మరియు [illegible] దస్తావేజులు పోయినవి. [illegible] NOC కూడా పొంది ఉన్నారు. [illegible]

ఆస్తి వివరము : విశాఖపట్నం జిల్లా, పెదగంట్యాడ మండలం, [illegible] సర్వే నెం.10 [illegible] ప్లాట్ నెం.90MIG-PH-III PG లే-అవుట్‌లో 267 చ.గజాలు [illegible] డోర్ నెం.24-78-2 మరియు 825 [illegible] హద్దులు : తూర్పు : ప్లాట్ నెం.83MIG-PH-III PG లే-అవుట్, దక్షిణం : ప్లాట్ నెం.89MIG-PH-III PG లే-అవుట్, పడమర : 33 అడుగుల రోడ్డు, ఉత్తరం : ప్లాట్ నెం.91.

ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా, సదరు రిజిస్టర్ దస్తావేజులు ఎవరికైనను దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు ఏడు (7) దినములలోగా ఇవ్వగలరు. [illegible]

యస్. [illegible], M.Sc., LLB; అడ్వకేట్,
డోర్ నెం.49-48-19, NGGO's కాలనీ,
విశాఖపట్నం   [illegible], విశాఖపట్నం-16
తేది : 11.07.2025   ఫోన్ : 80740 40010